## కందకం అక్రమ రిజిస్ట్రేషన్ రద్దుచేయాలి

అమరచింత, అక్టోబర్ 21: మున్సిపాలిటీలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న కందకాన్ని ట్రస్ట్ పేరిట అక్రమంగా రిజస్ట్రేషన్ చేసుకున్నారని దానిని తక్షణమే రద్దు చేసి ప్రభుత్వ స్థలాల్లో కంచెలు ఏర్పాటు చేయాలని సోమవారం బీజేపీ పట్టణశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ప్రజావాణిలో వినతిపత్రం ఇచ్చినట్లు బీజేపీ పట్టణ అధ్యక్షుడు భాస్కర్ తెలిపారు. పట్టణంలో కోట్ల విలువ చేసి స్థలాలు ఉండగా కొంత మంది అడ్డదారిలో అక్రమించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాసీల్దార్‌తో పాటు, మున్సిపల్ కమిషనర్ కందకం భూమిని అక్రమంగా ట్రస్ట్ పేరిట రిజిస్ట్రేషన్ చేసుకున్నారని నిర్ధారించిన సంబంధిత అధికారులు ఇప్పటి వరకు వాటిని రద్దు చేయలేదన్నారు. తక్షణమే అక్రమంగా చేసుకున్న రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని, అలాగే ప్రభుత్వ స్థలాలను గుర్తించి కంచెలు ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు వినితపత్రం అందజేసినట్లు తెలిపారు. మండలకేంద్రంలో ఎస్‌బీఐ ఏర్పాటు చేయాలని అల్ ఇండియా చైర్మన్ శ్రీనువాసులుశెట్టికి బీజేపీ అధ్వర్యంలో లేఖ రాసినట్లుగా భాస్కర్ తెలిపారు.

## ఎంబీబీఎస్ విద్యార్థినికి సన్మానం

అయిజ రూరల్, అక్టోబర్ 21 : మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన సుస్మిత నీట్‌లో ప్రతిభ చాటి ఎంబీబీఎస్ సీటు సాధించడంతో బీఆర్‌ఎస్‌వీ నాయకుడు కుర్వ పల్లయ్య సోమవారం విద్యార్థినిని సన్మానించారు. ఈ సందర్భంగా పల్లయ్య మాట్లాడుతూ బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కళాశాలను ఏర్పాటు చేయడంతో మారుమూల గ్రామాల్లోని విద్యార్థులు సైతం ఎంబీబీఎస్ సీట్లను సాధిస్తున్నారన్నారు. సుస్మితకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్‌లో భరోసా కల్పిస్తామని ట్వీట్ చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో విద్యార్థిని తల్లిదండ్రులు బుజ్జమ్మ, దేవదాసు, నాయకులు కృష్ణ, ఓంకార్, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

## బంగారం కాజేసిందని..

- మైనర్‌పై పీఎస్‌లో అధికార పార్టీ నేత ఫిర్యాదు
- మనస్తాపంతో బాలిక ఆత్మహత్యాయత్నం

గద్వాల అర్బన్, అక్టోబర్ 21 : ఓ రాజకీయ నేత తన ఇంట్లో మైనర్ బాలికతో వెట్టి చాకిరీ చేయించడంతోపాటు ఇంట్లోని బంగారం చోరీ చేసిందని నింద మోపడంతో అవమానం భరించలేక బాలిక ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

మల్దకల్ మండలం బిజ్వారం గ్రామానికి చెందిన మైనర్ బాలిక జిల్లా కేంద్రంలోని అధికార పార్టీకి చెందిన నేత (ఆర్గనైజర్) ఇంట్లో కొన్నేండ్లుగా పని మనిషిగా ఉంటుంది. అయితే రెండు నెలల కిందట ఇంట్లో బంగారం పోయిందని, పని చేసే మైనర్‌పై అనుమానం వ్యక్తం చేసిన సదరు నేత.. బాలిక కుటుంబ సభ్యులను పిలిపించుకొని 'రెండ్రోజుల సమయమిస్తాం.. బంగారం ఎక్కడ పెట్టిన విషయం తెలపాలి'.. అంటూ గడువు విధించాడు. ఈ క్రమంలోనే బంగారు దొరికిందని తెలిపి.. మరి కొన్ని రోజుల తర్వాత అంత బంగారు లేదని, ఇంకా ఉండాలి.. నీవు ఎక్కడ పెట్టావో చెప్పాలని మరోమారు మైనర్‌ను, ఆమె కుటుంబీకులను నిలదీశారు. వారు ఒప్పుకోకపోవడంతో స్థానిక పోలీసులకు సదరు నేత ఫిర్యాదు చేసిన క్రమంలో మైనర్‌ను పీఎస్‌కు పిలిచి ఆరా తీసినట్లు తెలిసింది. తాను చేయని తప్పునకు నింద పడడంతో మనస్తాపం చెందిన మైనర్ వారం కిందట పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు వెంటనే కర్నూల్ దవాఖానకు తరలించగా.. చికిత్స పొందుతున్నది. ఈ విషయం తెలుసుకున్న ప్రజా సంఘాల నాయకులు సోమవారం బాలికను పరామర్శించి వివరాలు ఆరా తీశారు. మైనర్‌ను పనిలో పెట్టుకోవడం నేరమని, అధికారులు బాలికను ఆదుకొని నాయకుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


























